నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 20 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI

## సాగర్ క్రస్ట్ గేట్ల మూసివేత

నందికొండ, ఆగస్టు 19 : నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద తగ్గిపోవడంతో డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను సోమవారం ఎన్నెస్పీ అధికారులు నిలిపివేశారు. ఈ ఏడాదిలో ఆగస్టు 5న మొదటి విడుత క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రారంభించి 12 వరకు వరుసగా 8 రోజులు పాటు కొనసాగించారు. మరల రెండో విడుత 14న నీటి విడుదలను క్రస్ట్ గేట్ల ద్వారా ప్రారంభించి 19 వరకు 6 రోజుల పాటు విడుదల చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 14 రోజుల పాటు క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగించారు. ఇంకా ఆగస్టు, సెప్టెంబర్‌లో కూడా వరద వచ్చే అవకాశం ఉండడంతో మళ్లీ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగే అవకాశం ఉందని ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. నాగార్జునసాగర్ డ్యామ్ నుంచి ఎడమకాల్వకు 5,367, కుడికాల్వకు 8,067, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 26,796, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు 42,630 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అదే స్థాయిలో అవుట్ ఫ్లో కొనసాగుతున్నది.


## సంబురంగా రాఖీ వేడుక

అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనురాగానికి ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా సంబురంగా జరుపుకొన్నారు. సోదరులకు రాఖీలు కట్టి ఆడబిడ్డలు ఆశీర్వచనాలు అందించారు. స్వీట్లు తినిపించుకొని కుటుంబంతో సంతోషంగా గడిపారు.


హైదరాబాద్‌లో తన నివాసంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరి కట్టా రేణుక

# రుణమాఫీ ఉత్త ముచ్చట్నే..!





## జాబితాల్లో పేర్లున్నా మాఫీ కాలె

**రాజాపేట పీఏసీఎస్‌లో 805 రైతులకే మాఫీ**
**వివిధ కొర్రీలతో 487మందికి పెండింగ్**
**ఇంకా మొదటి, రెండో విడుత దగ్గరే..**
**తుర్కపల్లి పీఏసీఎస్‌లోనూ ఇదే సమస్య**
**అంతటా ఖాతాల్లో డబ్బులు జమ కాని వైనం**
**కొంత మందికే ఎలా చేస్తారని రైతన్న ఆగ్రహం**

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామానికి చెందిన రైతు గుండా ప్రభాకర్ రూ. 1.80 లక్షల రుణం 2020లో తీసుకున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన మూడు విడుదల రుణమాఫీలో ఏ ఒక్క దాంట్లో కూడా తనకు రుణం మాఫీ అయినట్లుగా రాలేదు. తీసుకున్న రుణానికి రెన్యూవల్ కూడా చేశాడు. అయినా మాఫీ కాలేదు. రుణం ఎందుకు మాఫీ కాలేదని వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే రుణం మాఫీ కాలేదు.. టెక్నికల్ ప్రాబ్లం ఉంది. స్పెషల్ డ్రైవ్‌లో రావచ్చని పొంతనలేని సమాధానం చెబుతున్నారు.

– యాదాద్రి భువనగిరి, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ)

రైతు రుణమాఫీ చిక్కుముడులు వీడటం లేదు. రుణ మాఫీ విషయంలో లోతుకు వెళ్లే కొద్దీ ఆసక్తికర విషయాలు బయటపడుతున్నాయి. ప్రభుత్వం చెప్పే మాటలకు.. చేసిన పనితీరుకు పొంతనే ఉండటం లేదు. వంద శాతం అమలు చేశామని సర్కారు చెబుతుంటే.. సగం మందికి మాత్రమే అయినట్లు లెక్కలు చెబుతున్నాయి. పీఏసీఎస్‌ల వారీగా లెక్కలు తీస్తే 50శాతం మందికి మాత్రమే మాఫీ అయ్యినట్లు తెలుస్తున్నది. అన్ని అర్హతలు ఉన్నా రుణ విముక్తి కాకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో తొలి విడుతలో 36,483 మంది, రెండో విడుతలో 17,991మంది, మూడో విడుతలో 13,011మంది రైతులను లబ్ధిదారులుగా గుర్తించారు. వీరే కాకుండా అనేక మంది పేర్లు జాబితాల్లో చేర్చలేదు. అయితే జాబితాలో ఉన్న వారికి కూడా పూర్తి స్థాయిలో మాఫీ కావడంలేదు. దీంతో అనేక మంది రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎందుకు కాలేదో వివరాలు తీసుకుంటున్నారు. అయితే సర్కారు పెట్టిన కొర్రీలతోనే అనేక మందికి రుణమాఫీకి దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఒకే ఇంట్లో ఇద్దరు ఉంటే, రేషన్ కార్డు లేకుంటే తదితర కొర్రీలతో రైతుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో పేర్లున్నా అనేక మందికి ''టు బి ప్రాసెస్డ్'' అని చూపిస్తున్నది. అధికారులు మాత్రం తామేం చేయలేమని చేతులెత్తేస్తున్నారు.

### తుర్కపల్లిలోనూ ఇదే సమస్య..

తుర్కపల్లి పీఏసీఎస్‌లోనూ రైతు రుణ మాఫీ అంతంత మాత్రంగానే జరిగింది. ఇక్కడ మొత్తం 1,051 మందిని రుణమాఫీకి గుర్తించారు. ఇందుకు రూ. 6.11 కోట్లు అవసరమని తేల్చారు. ఇప్పటి వరకు 743మందికి మాత్రమే మాఫీ అయ్యింది. తొలి విడుతలో 495మందికి (2.09కోట్లు), రెండో విడుతలో 182మందికి (1.30కోట్లు), మూడో విడుతలో 66 మందికి (3.84కోట్లు) డబ్బులు అకౌంట్లలో జమ చేశారు. ఇంకా 308 మందికి 2.26 కోట్లు మాఫీ కావాల్సి ఉంది.

### రాజాపేట పీఏసీఎస్‌లో 487 మందికి పెండింగ్..

రాజాపేట పీఏసీఎస్ పరిధిలో పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదు. సగం మందికి మాత్రమే బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ఇక్కడ 1,292 మందికి మాఫీకి అర్హులుగా గుర్తించారు. కానీ ఇప్పటి వరకు 805మందికి మాత్రమే మాఫీ అయ్యింది. మొదటి విడుతలో 441 మంది రైతులకు (2.50కోట్లు), రెండో విడుతలో 261 మందికి (2.61 కోట్లు), మూడో విడుతలో 103మందికి (80.80లక్షలు) మాఫీ చేశారు. ఇంకా 487మందికి పెండింగ్‌లో పెట్టారు. ప్రస్తుతం ఇంకా మొదటి, రెండో విడుతలో రావాల్సిన వారికి మాత్రమే మాఫీ అవుతున్నట్లు తెలుస్తున్నది. మిగతావారికి ఎప్పుడు అవుతాయో..? అసలు అవుతాయో.. లేదో.. కూడా స్పష్టత లేదు.

### మాఫీ కాలేదనేసరికి కండ్లలో నీళ్లు తిరిగినయి



నా పేరు మీద ఉన్న మూడు ఎకరాల భూమి కాగితాలు బ్యాంకులో పెట్టి 1.60 లక్షలు రుణం తీసుకున్న. ఎన్నికలకు ముందు కాంగ్రెసోళ్లు భువనగిరిలో పెట్టిన మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి సారు లక్ష్మీనర్సింహ స్వామి మీద ప్రమాణం చేసి అందరికీ రుణం మాఫీ చేస్తామని చెప్పడంతో ఎంతో సంతోషం అనిపించింది. ఇప్పుడు రుణమాఫీ లిస్టులో నా పేరు లేక పోవడంతో బ్యాంకోళ్ల దగ్గరికి పోయిన. వ్యవసాయ అధికారుల దగ్గరికి పోవాలని చెప్పిండ్రు. వాళ్ల దగ్గరి పోతే నా ఆధార్ కారటి ఇద్దరి పేరు మీద చూపిస్తుందని చెప్పి పంపించిండ్రు. తీసుకున్న రుణం మాఫీ కాలేదని చెప్పగానే కండ్లలో నీళ్లు తిరిగినయి. ఎవరికి చెప్పుకోవాలో అర్థమయితలేదు.

**-రంగ స్వామి, పాముకుంట, రాజాపేట మండలం**

### ఫోన్ మెసేజ్ వచ్చిన తర్వాత రమ్మంటున్నరు



నాకు 2.10 గుంటల భూమి ఉంది. 2015లో తొలుత చౌటుప్పల్‌లోని ఇండియన్ బ్యాంక్‌లో క్రాప్ లోన్ తీసుకున్నా. అప్పటి నుంచి ప్రతి ఏడాది క్రమం తప్పకుండా గడువులోపల లోన్ రెన్యూవల్ చేసుకుంటూ వస్తున్నా. ఇప్పుడు 1.40లక్షలు రెండో విడుతలో రుణమాఫీ కావాల్సి ఉండే. ఇప్పటి వరకు మాఫీ కాలేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే ఫోన్ మెసేజ్ వచ్చిన తర్వాత రావాలని చెబుతున్నరు. ఏమి చేయాలో తెలుస్తలేదు.

**-కరంటోతు లక్కు, ఎనగండి తండా, చౌటుప్పల్ మండలం**

### ఎన్నికలప్పుడు చెప్పిందేమిటి.. చేస్తున్నదేమిటి..?



నేను 2023లో రూ. 1.50 లక్షల రూపాయల బ్యాంకు రుణం తీసుకున్నా. ప్రస్తుతం కాంగ్రెస్ చేసిన రుణమాఫీలో నా పేరు లేదని ఏఈఓను అడిగితే లిస్టు రాలేదని, సర్వర్ ప్రాబ్లం ఉందని చెబుతున్నారు. ఇంకెన్ని సార్లు తిరుగాలి..? కొందరికి మాఫీ చేసి.. మరికొందరికి ఆపేయడం ఏంటి..? ఇదేం పద్ధతి..? అడ్డగోలుగా కొర్రీలు పెడుతూ రైతుల ఉసురు పోసుకోవడం మంచిదా..? ఎన్నికల ముందు ఒక మాట.. గెలిచాక ఇప్పుడు ఒక మాట చెబుతూ కాలం వెల్లదీస్తరా..? అర్హులందరికీ మాఫీ చేయాల్సింది.

**- కొడారి రాజు యాదవ్, రైతు, దత్తాయపల్లి, తుర్కపల్లి మండలం**

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ గంగాధర్


వైద్యులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

రామన్నపేట, ఆగస్టు 19: సీజనల్ వ్యాధులపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ కె.గంగాదర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆయన తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ రికార్డులను పరిశీలించారు. వార్డులలో చికిత్స పొందుతున్న రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 6న బాలింత కొల్లు మానస మృతికి గల కారణాలను వైద్యులు, సిబ్బందితో మాట్లాడి రికార్డు చేసుకున్నారు. ఆయన వెంట దవాఖాన వైద్యులు ఈశ్వర్, నాగేశ్వర్‌రావు, వరుణ్‌రెడ్డి, లింగాయాదవ్, మాధవచారి, నర్సింగ్ హెడ్ విజయలక్ష్మి, రాణి ఉన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడు బలి

- అప్పుల బాధతో కాల్వలో దూకి ఆత్మహత్య


సాయికుమార్ (ఫైల్)

నీలగిరి,ఆగస్టు19 : ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై కోట్లాది రూపాయలు పోగొట్టుకొని, అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..నల్లగొండ పట్టణానికి చెందిన తడకమళ్ల కిరాణ షాప్ యజమాని సోమయ్య కుమారుడు సాయికుమార్(28) చౌరస్తాలో కిరాణ వ్యాపారం కొనసాగిస్తున్నాడు. కొన్ని నెలలుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై దాదాపు రూ.3 కోట్ల పోగొట్టుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అప్పుల బాధ తట్టుకోలేక శనివారం అనుముల మండలం(చెక్ పోస్ట్)14 మైలు రాయి వద్ద కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవ తీసుకొని గాలింపు చర్యలు ముమ్మరం చేయడంతో సోమవారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ వద్ద కాల్వలో మృతదేహం లభించింది. పోలీసులు సాయి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## బీఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

రామగిరి, ఆగస్టు 19: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలలో చదివే ఛాత్రోపాధ్యాయుల 4వ సెమిస్టర్ రెగ్యులర్, 1నుంచి 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్, 2011 నుంచి 2020 బ్యాక్‌లాగ్ పరీక్షలు సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల్లో స్టిటింగ్ స్క్వాడ్ బృందాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎంజీయూ పరీక్షల విభాగం సీవోఈ ఉపేందర్‌రెడ్డి పర్యవేక్షణలో పటిష్టంగా నిర్వహించారు.


గుర్రంపోడ్ : నీటి కోసం గొడవ పడుతున్న కొప్పోలు,తుర్కపల్లి గ్రామాల రైతులు

# ఎండుతున్న ఏఎంఆర్‌పీ ఆయకట్టు

**పాలకుల పర్యవేక్షణ లోపం... అందని సాగునీరు**

**సముద్రం పాలవుతున్న సాగర్ నీళ్లు**
**నాలుగు మోటార్లకు ప్రస్తుతం నడిచేదే మూడే**
**నీళ్లున్నా ఎందుకివ్వరంటూ రైతుల ఆగ్రహావేశాలు**

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 19(నమస్తే తెలంగాణ) : దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డుకున్న చందంగా ఉందన్నది ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు(ఏఎంఆర్‌పీ) ఆయకట్టు రైతుల పరిస్థితి. కృష్ణానది ఉగ్రరూపం దాల్చి ప్రాజెక్టులను ముంచెత్తి సముద్రంలో వృథాగా కలిసిపోతుంటే ఆ నీటిని సకాలంలో పొలాలకు మళ్లించలేని దుస్థితి నెలకొంది. నాగార్జునసాగర్ నుంచి నీటిని ఎత్తిపోసి ఏఎంఆర్‌పీ ద్వారా సాగునీరు అందించాల్సి ఉండగా దాని ఊసే లేకుండా పోయింది. పాలకులకు ముందు చూపు కొరవడడంతో సీజన్ ముంచుకొచ్చినా నేటికి మోటార్ల మరమ్మతులు పూర్తి కాకపోవడం గమనార్హం. దీంతో ఏఎంఆర్‌పీలో నాలుగు మోటార్లకు గానూ మూడు మోటార్లే రన్ అవుతుండడంతో కాల్వల్లో సాగునీరు పారడం లేదు. దీంతో రైతుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. కాల్వల్లో వస్తున్న అరకొర నీళ్ల కోసం రైతుల మధ్య, ఊర్ల మధ్య ఘర్షణలకు ఆజ్యం పోసినట్లు అవుతుంది. ఓ వైపు లక్షల క్యూసెక్కుల నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతుంటే 1,800 క్యూసెక్కుల నీరు ఏఎంఆర్‌పీ ఆయకట్టుకు ఇవ్వలేకపోతున్నారని రైతులు మండిపడుతున్నారు.

నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో నిండుగా నీళ్లు ఉన్నప్పుడు పుట్టంగండి నుంచి నాలుగు మోటార్లతో 2400 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తూ అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నింపడమనేది సహజమైన ప్రక్రియ. అక్కడి నుంచి 600 క్యూసెక్కుల నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం మిగతా 1800 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాల్వ ద్వారా నల్లగొండ జిల్లాలోని తాగు, సాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉంది. అయితే వేసవిలో నీటి లభ్యత సరిగ్గా లేని నేపథ్యంలో రెండు లేదా మూడు మోటార్ల నడపి కేవలం తాగునీటి అవసరాలకే అందిస్తుంటారు. అయితే ఇదే సమయంలో నడపని మోటార్ల రిపేర్లు లేదా మెంయిటనెన్స్ పనులు ఉంటే సీజన్ ప్రారంభానికి పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనివల్ల జూలై చివరి లేదా ఆగష్టు ప్రారంభంలో సాగర్‌కు వరద వస్తే నాలుగు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసి తాగు, సాగునీటి అవసరాలకు ఉపయోగించవచ్చు.

### కాల్వల్లో పారని నీరు

ప్రస్తుతం ఏఎంఆర్‌పీ ఆయకట్టు పరిధిలోని ప్రధాన డిస్ట్రిబ్యూటరీలకు మాత్రమే నీటిని విడుదల చేశారు. వీటికి కూడా అరకొర నీటినే వదులుతున్నారు. దీంతో డిస్ట్రిబ్యూటరీల్లోని నీరు సైతం మధ్య వరకు కూడా వెళ్లడం లేదు. డిస్ట్రిబ్యూటరీ చివరలోని రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. ఇక డిస్ట్రిబ్యూటరీల నుంచి నీటిని గ్రామాలకు మళ్లించేందుకు రైతులు కాల్వకట్టలపైకి వస్తున్నారు. దీంతో మంగళవారం గుర్రంపోడు మండల పరిధిలోని కొప్పోలు వద్ద డి–25 వద్ద కొప్పోలు, తుర్కపల్లి గ్రామాల రైతుల నీటి కోసం ఘర్షణలకు దిగారు. ఇదే విధంగా డి–40 పరిధిలోని మాడ్గులపల్లి మండల రైతులు తిప్పర్తి మండల రైతులతో వాదులాటలకు దిగుతున్నారు. ఏఎంఆర్‌పీ ప్రధాన కాల్వలో కనీసం 1200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తేనే అన్ని కాల్వలకు సాగునీరు సమృద్ధిగా పారనుంది. కానీ ప్రస్తుతం 800 క్యూసెక్కుల నీరు కూడా రాకపోవడంతో రైతుల మధ్య గొడవలకు ఆస్కారం ఏర్పడుతున్నది.

# జిల్లాలో భారీ వర్షం

- సంస్థాన్‌నారాయణపురం మండలంలో పలుచోట్ల విరిగిన చెట్లు
- ఎండ వేడిమి నుంచి ఉపశమనం.. మెట్ట పంటలకు మేలు



యాదగిరిగుట్ట కొండ కింద కురిసిన వర్షం

యాదగిరిగుట్ట/చౌటుప్పల్/భువనగిరి సిటీ/సంస్థాన్‌నారాయణపురం, ఆగస్టు 19 : జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. యాదగిరిగుట్ట పట్టణంతోపాటు పలు గ్రామాల్లో సోమవారం సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. వారంరోజులుగా ఎండాకాలం మాదిరిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతన్నలకు ఇది అనుకూలంగా మారింది. పత్తి వాడిపోతున్న సమయంలో వర్షం రావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ వర్షంతో స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు కొద్ది సమయం ఇబ్బంది ఏర్పడింది. కొండకింద పార్కింగ్‌లో నిలిపిన వాహనాలు వర్షపు నీటిలో కొద్దిమేర మునిగాయి. గుట్టలో 25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

### తుర్కపల్లిలో అత్యధికంగా 3.25 సెంటీమీటర్ల వర్షం

జిల్లావ్యాప్తంగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి విపరీతమైన ఎండ కొట్టగా సాయంత్రం నాలుగు గంటల సమయంలో వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా తుర్కపల్లి మండలంలో 3.25 సెంటీమీటర్లు, యాదగిరిగుట్టలో 2.5, చౌటుప్పల్‌లో 1.83 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సంస్థాన్ నారాయణపురం మండలంలో కురిసిన వర్షంతో రోడ్లపై చెట్లు కూలి పడ్డాయి. వరిపొలాలకు భారీగా నీరు చేరింది.


సంస్థాన్‌నారాయణపురం : వావిళ్లపల్లి గ్రామంలో నీట మునిగిన వరి చేను


చౌటుప్పల్‌లో కురుస్తున్న వర్షం